ఆకుపచ్చని.. ఆకర్షణ..



ఈ ఫొటోను చూసి నేలపై గ్రీన్ మ్యాట్ పరిచారని అనుకుంటున్నారా.. అచ్చం అలాగే కనిపిస్తుంది కదా.. అయితే మీరు పప్పులో కాలేసినట్లే.. ఇది హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఉన్న బైరాన్‌ఖాన్‌చెరువు. విజయవాడ జాతీయ రహదారి-65కు అనుకుని ఉన్న ఈ చెరువును గుర్రపుడెక్క పూర్తిగా ముంచేసింది. దీంతో చెరువు మొత్తం ఆకుపచ్చని రంగుతో స్థానికులను ఆకర్షిస్తోంది. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : అరుణ



ఆదర్శనగర్‌కాలనీలో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్

మన్సూరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌కాలనీలో డ్రైనేజీ, వరదనీటి నాలాలు పొంగిపొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శుక్రవారం ఆ ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి సమస్య శాశ్వత పరిష్కారంపై సూచనలు చేశారు. అంతకుముందు సహభావనటౌన్‌షిప్ బ్లాక్-బీలో రూ.10లక్షల ఎంపీ నిధులతో బోరు వేయించే పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాలలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, డీఈ కనకయ్య, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సహభావన టౌన్‌షిప్ బీ-బ్లాక్ అధ్యక్షుడు ఐతగోని నరేష్, ఉపాధ్యక్షుడు మారగోని స్నైడర్, ప్రధాన కార్యదర్శి పవన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అర్చన పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం మల్యాల యాదగిరి తెలిపారు. ట్రయాతలాన్(60 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ బ్యాక్‌త్రో) అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న మందరి ధనుంజనేయులు, అండర్-16 విభాగంలో ముడావత్ శివాజీ ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 30, 31వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలోని ప్రధాన అథ్లెటిక్స్ సింతటిక్స్ స్టేడియంలో జరుగనున్న 11వ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్‌లో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంను అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి : పవన్‌కుమార్

ఎల్బీనగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న బాలాపూర్, ఇబ్రహీంపట్నం ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రంగారెడ్డి అధ్యక్షుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. బాలాపూర్ ఎంఈఓ కృష్ణయ్య, ఇబ్రహీంపట్నం ఎంఈఓ హీర్యానాయక్‌లపై రంగారెడ్డి జిల్లా ఏడీఈ పూర్ణచందర్‌రావుకు బీజేవైఎం నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ బాలాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఎంఈఓలు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఎంఈఓల సహకారంతో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. బాలాపూర్, ఇబ్రహీంపట్నం ఎంఈఓలతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు జైసాయి తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణకు అదనపు వాహనాలు కేటాయించండి



అదనపు కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

మన్సూరాబాద్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సరిగ్గాలేక డివిజన్ పరిధిలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా స్పందించకపోవడంతో బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిపడా వాహనాలు లేక చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని, వెంటనే అదనపు చెత్తసేకరణ వాహనాలు కేటాయించాలని కోరారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం శానిటేషన్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అదనపు కమిషనర్ సీఎస్ రఘుప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

న్యాయవాది రాంనర్సింహగౌడ్‌కు సన్మానం

హయత్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ విభాగంలో నుంచి 'భారతదేశంలో చిన్న పిల్లలపైన నేరాలు- నివారణ అంశంపైన' పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్న న్యాయవాది వీరమళ్ల రాంనర్సింహగౌడ్‌ను హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ న్యాయ, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ఎదగాలని రాంనర్సింహగౌడ్‌ను కోరారు. భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేష్, డైరెక్టర్లు ఇంద్రవర్ధన్‌గౌడ్, న్యాయవాదులు లింగంగౌడ్, సంతోష్ గౌడ్, అంజయ్యగౌడ్, సుధా, శృతి, పద్మ పాల్గొన్నారు.

డాక్టర్ వేముల నారాయణకు..

సైదాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మద్రాస్ విశ్వవిద్యాలయం మెరీనా ఆవరణలో భువనచంద్ర సాహితీ సాగరం- సృజనాత్మక హరివిల్లు అనే అంశంపై గురు, శుక్రవారాలలో నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ వేముల నారాయణను సన్మానించారు. భువనచంద్ర కవితలు-పరిశీలన అనే అంశంపై పత్రాలు సమర్పించినందుకు ఆయనను సదస్సు నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో మద్రాస్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆచార్య శంకర్‌రావు, సినీ గేయ రచయితలు భువనచంద్ర, వనమాలి, సంగీత రచయిత విద్యాసాగర్, వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించాలి

సరూర్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ 16వ డివిజన్‌లోని సాయిస్మార్ట్‌నగర్‌కాలనీలో అపరిష్కృతంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్ నిర్మాణం పనులను వెంటనే చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మునిసిపల్ కమిషనర్ నాగమణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని డ్రైనేజీ అవుట్‌లెట్ నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్లు పిలిచినప్పటికీ వాటిని ఓపెన్ చేయడంలో జాప్యం చేస్తుండడంతో సమస్య అలాగే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



ఐఎస్‌సదన్ డివిజన్ గణనాథుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి



వాణినగర్ యూత్ అసోసియేషన్ లంబోదరుడిని దర్శించుకున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



సాహెబ్‌నగర్‌లో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నారామ్మోహన్‌గౌడ్, జగన్మోహన్‌గౌడ్



బాలాపూర్ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న ద్వారకామాయి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

గణేశ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలి

చంపాపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా, సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ రెడ్డికాలనీలోని దివ్యాంగుల బాలుర వసతిగృహంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్యే దివ్యాంగులతో కలిసి శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ గణపయ్య మండపాన్ని తనిఖీ చేస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, పక్కన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్



రెడ్డికాలనీలోని దివ్యాంగుల వసతిగృహంలో గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



బాలాపూర్ గణనాథుడి సేవలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

ఏకదంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలి : బంగారయ్యశర్మ

ఎల్బీనగర్ : ఏకదంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆధ్యాత్మికతత్వవేత్త, తత్వ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని వాసవికాలనీ నివాసుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మహాగణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి బహుమతులను ప్రదానం చేశారు.

బాలాపూర్ స్వర్ణగిరిలో భక్తుల సందడి

సరూర్‌నగర్ : స్వర్ణగిరి ఆలయ నమూనాలో ఏర్పాటైన బాలాపూర్ గణేశ్ మండపం వద్ద భక్తుల సందడి పెరుగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రిదాకా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మండపంలోని బడా గణేశుడిని దర్శించుకున్నారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మీర్‌పేట్ ప్రశాంతి హిల్స్‌లోని శ్రీద్వారకామాయి సాయిబాబా పీఠాధిపతి శ్రీగోపాల కృష్ణానంద స్వామీజీ, సినీ హీరో మంచు మనోజ్, పలువురు పోలీసులు అధికారులు, ఇతర నాయకులు బాలాపూర్ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగోల్, బీఎన్‌రెడ్డినగర్‌లలో..

మన్సూరాబాద్ : మన్సూరాబాద్, నాగోల్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని వినాయక మండపాలు, ఆలయాల్లో బొజ్జ గణపయ్యకు భక్తితో పూజలు నిర్వహిస్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లో శ్రీరామ్ గణేశ్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసి న మండపం వద్ద మూడో రోజైన శుక్రవారం అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దగౌని జగన్మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో 26 అడుగుల్లో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, దత్తాత్రేయ గణనాథుడికి స్థానిక మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నారామ్మోహన్‌గౌడ్ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

భారీ గణపయ్య విగ్రహాల తనిఖీ

చాదర్‌ఘాట్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో సుమారు 1140 విఘ్ననాథుల విగ్రహాల ప్రతిష్ఠ జరిగిందని జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని కొలువుదీరిన భారీ గణపయ్య విగ్రహాల మండపాలను తనిఖీ చేశారు. భారీ గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించిన ఉత్సవ సమితి నిర్వాహకులు నిమజ్జనానికి ట్యాంక్ బండ్‌కు వెళ్లకుండా దగ్గర్లో ఉన్న చెరువులకు వెళ్లాలని ఆయన సూచించారు. నగరంలో మెట్రో రైలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు ఉన్నందున వాటిని దృష్టిలో పెట్టుకుని ట్యాంక్ బండ్‌కే వెళ్లాలన్న ఆలోచనలో మార్పు చేసుకోవాలని ఆయన సూచించారు.



చంపాపేటలోని నల్ల, ఎర్రపోచమ్మ ఆలయంలో పూజలందుకుంటున్న 22అడుగుల గణనాథుడు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

హయత్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబుతో పాటు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, అంకితభావంతో రామ్మూర్తి పంతులు అతి కష్టమైన గ్రాంధిక భాష నుంచి తెలుగును వ్యవహారిక భాషలోకి మళ్లించారని అన్నారు. తెలుగుకు ఆరాధ్యదైవంగా మారాడని కొనియాడారు. తెలుగు దశ దిశలా మారడానికి ఆయన చేసిన కృషి సామాన్యమైనది కాదని పేర్కొన్నారు. తెలుగు విభాగం అధ్యక్షుడు బి. నర్సింహ మాట్లాడుతూ విద్యార్థులు దీక్ష, పట్టుదలను అలవర్చుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి రామ్మూర్తి పంతులు ఆశయాలను అలవర్చుకుని భవిష్యత్తులో ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు వెంకటలక్ష్మి, శశిధర్‌తో పాటు పలువురు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషపై ఆసక్తి పెంచాలి : జగదీశ్వరి

కొత్తపేట : పిల్లల్లో తెలుగు భాష పట్ల ఆసక్తి పెంచాలని అనువాదకురాలు, రచయిత్రి జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కొత్తపేట న్యూనాగోల్‌లోని సీనియర్ సిటిజన్ల భవనంలో కొమర్రాజు ఫౌండేషన్ నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం తెలుగు మాట్లాడే వారందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎస్ఎన్‌మూర్తి, డా.శ్యామల, కొమర్రాజు జ్ఞానకుమార్, రాజారెడ్డి, కిన్నెర సుబ్బారావు, ఆశాలత, లలిత పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్టేడియాలు నిర్మిస్తాం : మధుయాష్కీగౌడ్



జాతీయ క్రీడా దినోత్సవంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచే క్రీడాకారులను తయారు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అడ్వెంచర్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందేలా తన వంతు కృషి చేస్తానని, అవసరం అయితే ప్రభుత్వంతో మాట్లాడతానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేసి క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడాకారులకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. క్రీడాకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్రీడామంత్రి వాకిటి శ్రీహరితో చర్చిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యంతో క్రీడా స్టేడియాలు నిర్మిస్తామని అన్నారు. ఈ సందర్భంగా అడ్వెంచర్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మధుయాష్కీగౌడ్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి టి. ఐజయ్య, ఎంపీడీవో శ్రీవాణి, అడ్వెంచర్ క్లబ్ ఆఫ్ తెలంగాణ సెక్రెటరి రంగారావు, మేరా యువ భారత్ జిల్లా అకౌంటెంట్ ఆఫీసర్ నర్సింహారావు పాల్గొన్నారు.

బైరాన్‌ఖాన్ చెరువులో నిమజ్జనానికి సర్వం సిద్ధం



బైరాన్‌ఖాన్‌చెరువు వద్ద సిద్ధం చేసిన నిమజ్జన ఘాట్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద బైరాన్‌ఖాన్ చెరువులో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ ల సంయుక్త ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. నిమజ్జన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 50మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఘాట్ వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాట్లు చేశారు.

క్రేన్‌లతో నిమజ్జనం..

బైరాన్‌ఖాన్‌చెరువు ఘాట్‌కు తరలివచ్చే వినాయకుల నిమజ్జనం చేసేందుకు అధికారులు క్రేన్‌లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక్క క్రేన్ రేడి చేయగా 7, 9 రోజుల్లో మరో రెండు క్రేన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఘాట్‌కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టారు. గణేశ్ నిమజ్జనానికి వచ్చిన వాహనాలతో ట్రాఫిక్‌జాం కాకుండా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. వివిధ ప్రాంతాల నుంచి ఘాట్‌కు వచ్చే వాహనాలు విజయవాడ జాతీయ రహదారి గుండా ఇనాంగూడ బ్రిడ్జి కింద యూటర్న్ తీసుకుని యశోదయకాలనీ మీదుగా నేరుగా ఘాట్ వద్దకు చేరుకునేలా అధికారులు ప్లాన్‌చేశారు. నిమజ్జన అనంతరం వాహనాలను మరోమార్గం ద్వారా బయటకు పంపించేలా మ్యాప్‌ను తయారు చేశారు. వాహనాలతో ఘాట్ వద్ద ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా లాఅండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో అక్కడ ఔట్‌పోస్టును ఏ ర్పాటు చేశారు. నిమజ్జనం చేసిన అనంతరం చెరువులో నుంచి వ్యర్థాలను తొలగించేందుకు ట్రాక్టర్లను కూడా సిద్ధంచేసి పెట్టారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల శివారు గ్రామాలతో పాటు హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్, లక్ష్మారెడ్డిపాలెం నుంచి పెద్దఎత్తున వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. గణేశ్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

వినాయక నిమజ్జనం షురూ..





వినాయకచవితిని పురస్కరించుకుని గణనాథులను ప్రతిష్ఠించిన ఉత్సవ నిర్వాహకులు మూడు రోజుల పాటు విశేషంగా పూజలు నిర్వహించారు. మూడో రోజైన శుక్రవారం పలు వినాయక మండపాల నిర్వాహకులు తమ తమ గణనాథులను గంగ ఒడికి చేర్చేందుకు ఊరేగింపుగా సరూర్‌నగర్ చెరువు కట్ట వద్దకు తీసుకొచ్చారు. చివరగా పూజ చేసి వినాయకులను సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనం చేశారు. దీంతో నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి



సలీం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బలాల

మూసీలో గల్లంతైన వ్యక్తి కుటుంబానికి పరామర్శ

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న మహ్మద్ సలీం మూసీలో వరద ప్రవాహంలో గురువారం గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న హైడ్రా సిబ్బంది మూసీలో గాలింపు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం కూడా హైడ్రా సిబ్బంది మూసీలో గల్లంతైన ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగించారు. సాయంత్రం వరకు కూడా ఆచూకీ లభ్యం కాలేదు. గల్లంతైన వ్యక్తి కుటుంబ సభ్యులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ బలాల పరామర్శించారు. సంఘటనకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని హైడ్రా సిబ్బందిని, సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పరామర్శించిన వారిలో ఎంఐఎం మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షఫీయుద్దీన్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మన్సూరాబాద్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి నాగోల్ డివిజన్ మల్లికార్జుననగర్‌కాలనీ బండ్లగూడ చెరువులో ఓ మృతదేహాన్ని గమనించి నాగోల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి చూడగా చేతిపై బెంగాలీ భాషలో 'అమిత' అని రాసి ఉంది. కానీ అతడి వద్ద మరే ఆధారాలు లభించకపోవడంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన 25 నుంచి 30 ఏళ్ల వయసు గల ఓ గుర్తుతెలియని వ్యక్తిగా భావించారు. మృతదేహాన్ని గుర్తించిన వారెవరైనా ఉంటే నాగోల్ పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన

కొత్తపేట : ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. శుక్రవారం రాచకొండ పరిధిలోని ఉప్ప ల్ సెయింట్ జాన్ హైస్కూల్ నుంచి 39మంది విద్యార్థులు పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి రోడ్డు భద్రత, నిబంధనల వీడియోలు ప్రదర్శించారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మజీద్‌పూర్, ఎల్బీనగర్, ఉప్పల్ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 579మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శిస్తూ టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావు, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అవగాహన కల్పించారు.

58 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్

కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 58 మంది మద్యంప్రియులకు 58మంది కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం టీటీఐ లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య మద్యంమత్తులో వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786